అత్తవారిచ్చిన కట్నం

శ్రీ ప్రతాపరావు

డబ్బు తేలికగా, ఏం కష్టపడకుండా రావాలనుకోవడం మానవ సహజం. అందుకనే లాటరీలు, పజిల్స్ ఎక్కువవుతున్నాయి యీ లోకంలో. దాసు కొసంవత్సరమే పెళ్ళయింది. పచ్చలారని పసిబిడ్డనిచ్చి కూడా పది వేలివ్వాల్సొచ్చిందే అని గునుస్తూ యిచ్చాడు దాసు మామగారు ఆ డబ్బు.

దాసు కష్టపడకుండా డబ్బు సంపాయించాలనే తత్వంలోవాడు. పెళ్ళి అనే ఆయుధాన్నుపయోగించి కొంత డబ్బు చేసుకున్నాడు. నాలుగు డబ్బులు గలగలలాడుతూండేటప్పటికి మనస్సు పరి పరి విధాల పోయింది.

మా యింటి కొచ్చాడు:

"ఒరేయ్, రామం! డబ్బు సంపాదించే విధమేదయినా చెప్పరా!"

"ఉద్యోగం చెయ్యరా!" అన్నాను అప్పుడే ఏదో పరమ సత్యం కని పెట్టినట్టు.

"ఏడిశావులే! అది నాకు నువ్వు చెప్పాలట్రా! మరి అంత వాజమ్మననుకున్నావా ఏమిటి! ఒరేయ్, కాలు కదపకుండా, వొళ్ళు కదలకుండా, యినప్పెట్టి తియ్యకుండా, మాటపడకుండా నాలుగంకెలమీద ఉండాలి ఆదాయం. అలాంటిదేదయినా తెలిస్తే చెప్పు." అన్నాడు

"దాసూ, స్నానం చేసొచ్చావా?"

"ఎందుకొచ్చిందా ధర్మసందేహం?

"చేసొచ్చావా?"

"ఆఁ"

"అయితే విను. తూర్పుకుతిరిగి పద్మాసనం వెయ్యి ఆ దీన బాంధవుణ్ణి ప్రార్థించు. ఎప్పటికైనా కటాక్షిస్తాడేమో! ఏ నాటికయినా కరుణిస్తాడేమో!

"భక్తా, నీ భక్తికిం మెచ్చితిని. ఇదే గైకొనుము పది వేల రూప్యంబులు అని కూడా చెప్పేయి." అన్నాడు దాసు.

"లేకపోతే ఏమిటిరా గొంతెమ్మకోరికలు!" అన్నాను.

'నేను చాలా సీరియస్‌గా చెప్తున్నానురా రామం! ఏదయినా ఒకుపాయం ఆలోచించాలి.' అని మళ్ళీ మొదలెట్టాడు.

"ఇదుగో, అత్తారిచ్చిన పదివేలున్నాయి. ఒక అయిదు వేలు పెట్టి వ్యాపారం చెయ్యి."

"ఏం వ్యాపారం చెయ్యాలి?" అని అడిగాడు.

"నిత్యమూ అవసరంగా ఉండేవి చూసి ఫ స్సాపు పెట్టు" అన్నాను.

"అలాగే పెట్టాననుకో. అవి అమ్మకపోతే క్రిష్ణలో పారేయాలి. పోనీ అమ్మినయ్యే అనుకో, ధరలు తగ్గితే, చీటికి మాటికి ధరలు హెచ్చి, తగ్గే రోజులలో రిస్కు (*risk*) ఎలా తీసుకుంటాము? పైగా వడ్డీ రాదయ్యె, డబ్బు లాకప్ అయిపోతుంది. కనుక ఈ వ్యాపారం ఏమీ లాభం లేదు." అని పెదవి విరిచాడు.

'దాసూ, యిక నేను ఏదీ చెప్పలేను. బహుశ నీవు చేయతగ్గ వ్యాపారం ఈభూమిమీద లేదనుకుంటాను. ఆ ఆర్తరక్షకుడే నీకు శరణ్యము వాడికే ఒక ఉత్తరంవ్రాయి అని ఊరుకున్నాను.

సిగరెట్టుమీద సిగరెట్టంటించి, డి. వి. సుబ్బారావు పోజు పెట్టి ఐదు నిముషాలదే పనిగా ఆలోచించాడు దాసు మెరుపులా తట్టిందొక ఆలోచన.

"ఒరేయి రామం! ఆలోచించానురా. ఉపాయం, విను." అన్నాడు.

"ఏమిటిరా, అది?" అని అడిగాను.

"వివాహ ఇన్‌ఫర్మేషన్ బ్యూరో, పెడదాము. డబ్బక్కర్లేదు. మనకున్న కోరికలన్నీ తీరతాయి."

"పెట్టి ఏం జేస్తావు?"

"పెళ్ళిళ్ళు చేస్తాను, సంబంధాలు కుదురుస్తాను. వాళ్ళూ, వీళ్ళూ కూడా డబ్బిస్తారు."

"అయితే పెళ్ళిళ్ళ పేరయ్య వవుతావన్న మాట."

"మంచి ఉపాయం కదురా!"

"నీ బొంద! పెళ్ళంటే మాటల్లో ఉందిరా. వాళ్ళనూ, వీళ్ళనూ దగ్గరకు జేర్చాలి. ఎవళ్ళకు చెప్పే ఖబుర్లు వాళ్ళకు చెప్పాలి. ఇటు లోపాలుంటే అవి కనపడకుండా అటు చెప్పాలి. అటుంటే యిటు చెప్పాలి. పెళ్ళయిన తరువాత వాళ్ళువీళ్ళు తెలుసుకుంటే నిన్ను ఒక దీవించడం దీవిస్తారు నువ్వు మళ్ళీ ఈ జన్మలో మరచిపోలేవు ఎవడయినా పొగరుమోతుంటే దేహశుద్ధికూడా చేసేస్తాడు. పెళ్ళిళ్ళ పేరయ్యంటే తలలు మార్చేవాడని అర్థం! తెలిసిందా?" అన్నాను.

"మరేం చేద్దాము?" అని మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

"నీదానిమీద కొంచెం ఇంప్రూవుమెంటేమిటంటే, మనం ఒక కేసు ప్రయత్నం చేద్దాము. వస్తే డబ్బొస్తుంది. లేదా ఎక్స్పీరిమెంటనుకుందా"మన్నాను.

"నువ్వు చెప్పేది నాకర్థం గాలేదు." అన్నాడు దాసు.

"ఒక డబ్బున్నమ్మాయికి వరుడు కావాలి అని ప్రకటిద్దాము దాంతో మనకు ఒక పెళ్ళికొడుకులజాబితా ఏర్పడుతుంది.

"అంత వెర్రి వెధవలున్నారంటావా దేశంలో!"

"తొందరెందుకు? ఉంటే ఉత్తరాలొస్తయి లేకూ, *advertisement cost*దండగ. అంతేనా, కొంప మునిగిపోయిందేముంది?

"అది సరేరా? అసలు అమ్మాయేదీ? ఏరసికుడయినా చూస్తానని వస్తే వ్యవహారం తలక్రిందులైపోతుంది. మన సంగతి పసికట్టారా, వొళ్ళు బొబ్బట్టుడికినట్టు ఉడికించేస్తారు తెలిసిందా?"

"నువ్వు చెప్పింది నిజమేరా?" అన్నాను.

ఈ సారి యిద్దరమూ ఆలోచనలో పడ్డాము.

"అదు గడుక్కి ప్రోబ్లమేరా! హైడ్రోజెన్ బాంబు కనిపెట్టినవాడికి కూడా యిన్ని *problems* ఉండి ఉండవు." అన్నాడు దాసు.

"తట్టిందిరా! మన సినోరా సీతాయిగాడితో మాట్లాడి నే ఏర్పాటు చేస్తాను. నువ్వెళ్ళిరా" అన్నాను.

సాయంత్రం వస్తానని చెప్పి దాసు వెళ్ళిపోయాడు.

సినోరా సీతాయిగాణ్ణి పట్టుకునేటప్పటికి బ్రహ్మప్రళయమయింది. వాడికంతా విపులీకరించి చెప్పాను.

'మీకెందుకు, మీకు ఆడదుంటే సరా!

నేనన్నీ ఏర్పాటు చేస్తానుగా వెళ్ళండన్నాడు సీతాయి.

ఎవరో ఒక వేశ్యను చూపించాడు. నాకు చూడడానికి వేశ్యలా లేదు. పని గడచిపోతుందనుకున్నాను.

వచ్చే పెళ్ళికొడుకులలో ఆమె కెంత డబ్బున్నదని ప్రశ్నిస్తారేమో! ఆ బజారులో ఉంటే విషయం బయట పడుతుంది గదా! అని అనుమానం పీకుతింటోంది.

సినోరా సీతాయితో చెప్పి ఆ అమ్మాయిని వేరే పేటలో పెట్టాము.

దాసు ఆమె పేరట డబ్బు బ్యాంకులో మొదట వేయనన్నాడు. ఫరవాలేదురా, సినోరా సీతాయి మన కన్యాయం చెయ్యడురా అని నచ్చచెప్పాను. మొదట చాలా బింకంగా ఉన్నా, తరువాత వేశాడు.

మర్నాడు దిన పత్రికలో

"ఒక ధనవంతురాలయిన యువతికి అందమైన వరుడు కావాలి. వరుడు నడివయస్కుడై, ఆస్తిగలవాడయి ఉండాలి. కుల మత భేదాలు లేవు. ప్రకటన ఆదర్శమైన వరుని కోసం చేయబడింది."

వివరాలకు వివాహ ఇన్‌ఫర్మేషన్ బ్యూరోకు వ్రాయండి." అని మా ప్రకటన పడింది.

ఆ మర్నాడు రెండొందలు ఉత్తరాలొచ్చాయి మాకు. ఆ తరువాత రోజు అయిదొందలు యిలాగ వారం రోజుల్లో మూడు వేలు ఉత్తరాలొచ్చాయి పారిందిరా పన్నాగం అనుకొన్నాము నేనూ దాసూ.

ఉత్తరాలకు జవాబులు వ్రాయడం మొదలెట్టాము. ఫోటోలు పంపిన వాళ్ళకు వంశ వివరాలు, వాళ్ళకున్న ఆస్తి వివరాలు వగైరాలు వ్రాయమనీ, ఫోటోలు పంపని వాళ్ళకు ఫోటోలు పంపమనీ, ఎవరికి తగ్గట్టు వాళ్ళకు వ్రాశాము. జవాబుతో పాటు రెండు రూపాయలు కూడా పంపమని కోరాము

రెరేడు రూపాయలు పంపమనేటప్పటికి ఒక అయిగు వందలు పెళ్ళికొడుకులు తగ్గిపోయారు. మిగతా వాళ్ళు డబ్బు పంపించి ఇంటర్వ్యూల కేర్పాటు చేయమన్నారు.

ఒక రెండొందలమంది కేర్పాటు చేశాము. కొంతమందికి తను వధువుకు నచ్చనట్టు వ్రాశాము. మిగతావాళ్ళకు వధువు వరుణ్ణి ఏరుకొందని వ్రాశాము.

ఈ లోపుగా ఆ అమ్మాయికి సినోరా సీతాయితో చెప్పించాము. ఎవరొచ్చినా యిష్టం లేదని చెప్పమని. ఆ అమ్మాయి సరేనని ఒప్పుకుంది.

వధువుకు వరుడు నిశ్చయమయ్యాడని చెప్పి, కొంతమంది వరుల్ని సాగనంపమని సీతాయితో చెప్పాము.

అనుకున్నవన్నీ ఏ అడ్డంకీ లేకుండా సలక్షణంగా జరిగిపోతాయి ఆ అమ్మాయికి ధన్యవాదాలు చెబుదామని నేను సీతాయి వెళ్ళాము. బిక్క మొహం పెట్టింది. ఏమిటదని సీతాయి గర్జించాడు ఉన్న చనువు కొద్దీ.

"ఒకాయన వచ్చారు. అందరి లాగా నే. ఎన్నో వృద్ధ జంబుకాలొచ్చాయి. సూట్లొచ్చాయి, కోరమీసాలొచ్చాయి. ఎంతమందో వచ్చారు. ఎవరిమీదా నా మనసు లగ్నం కాలేదు. ఎందుకనో ఆయన్ని పెళ్ళిచేసుకొందామని బుద్ధి పుట్టింది. అడిగాను. సరేనని ఒప్పుకున్నారు. కాని ఒక షరతు పెట్టారు. (*Bank pass book*) బ్యాంకులో ఉన్న డబ్బు ఆయన కివ్వాలట సరేనన్నాను. రేపొస్తా నన్నారు నన్నాయన కిచ్చి వివాహం చేయరా?" అని జంకుతూ అడిగింది.

నాకు చెమటలు పట్టాయి. సీతాయి కూడదని మందలించాడు ఆ వచ్చినతని కిచ్చి వివాహం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటా నంది.

ఇదేదో ప్రళయంగా ఉందే ననిసీతాయి, నేను బుర్రలు చెడగొట్టుకున్నాము. ఆ అమ్మాయి ఎంత చెప్పినా వినలేదు. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్ళంది.

దాసుముందు పెట్టాను వ్యవహారమంతాను.

'నేను ముందు చెపితే విన్నావట్రా! నాకప్పుడే అనుమాన మేసింది యిలాంటిదేదో జరుగుతుందని' అన్నాడు.

'ఇప్పుడు నీ కొచ్చిన నష్ట మేమిటిరా! అప్పనంగా అయిదు వేలొచ్చాయి. మూడు వేలు ఆ అమ్మాయి తీసుకుంటే నష్ట మేమిటి! అక్కడికి రెండు వేలు లాభమే నాయె. ఒక పతనమయిన స్త్రీని ఉద్ధరించిన వాడవూ అవుతావు. లాభం పొందిన వాడవూ అవుతావని లెక్చరిచ్చేశాను.

'నువ్వు చెప్పి చూశావా యిది అసంభవమని?' అని నన్ను ప్రశ్నించాడు.

'నా శాయశక్తులా ప్రయత్నించాను. కాని లాభం లేకపోయింది' అని నిస్పృహతో అన్నాను.

'సరే, నువ్వు చెప్పిన ఉపాయంతో ఆర్జించాను కాబట్టి, తీసుకోమను మూడు వేలు. యిదుగో చెక్కు.' అని సంతకం పెట్టిచ్చాడు.

దాసు త్యాగబుద్ధికి సంతోషించినా లోపల సందేహం కలిగింది. చెక్కు మార్చి మూడు వేలు తీసికెళ్ళి ఆమె కిచ్చాను.

మర్నాడు సాయంత్రం దాసు కనుపించాడు.

(43-వ పేజీ చూడండి)



ఒకే సీనులో చూపడం ఇందుకు ఉదాహరణ.

పెండ్యాల నాగేశ్వరరావుగారి సంగీతం భావస్ఫోరకంగా ఉంది. వంతపాటలు, ముఖ్యంగా మాధవపెద్ది సత్యంగారి గానం కమ్మగా హృదయాహ్లాదకరంగా ఉన్నాయి. సౌండు, ఫొటోగ్రఫీ నిర్దుష్టంగా ఉన్నాయి. వరలక్ష్మి తన పాత్రను అర్థంచేసుకుని ప్రతిభావంతంగా నటించింది. రామగోపాల్ చిత్రానికి తలమానికంగా ఉన్నాడు. అతని నటన సహజంగా ఉన్నది. ఆ రెండు పాటలను పాడించకపోతే అతని పాత్ర ఇంకా రాణించేది. అతనికి మంచి భవిష్యత్తు ఉన్నట్లు ఈ చిత్రం నిరూపిస్తోంది. శివరాం మామూలు ధోరణిలోనే నటించాడు.

"దీక్ష" చిత్రంలో శృంగారానికే కాదు స్థానం లేనిది; చవకబారు హాస్యం కూడా బహిష్కరింపబడింది. అయితే సంభాషణల్లో అక్కడక్కడ సున్నితమైన హాస్యంలేకపోలేదు. మొత్తంమీద ఈ చిత్రం ఆర్థికంగా విజయం పొందుతుందనడానికి సందేహమక్కర్లేదు. ★

సృష్టి - అనుకరణ

(40-వ పేజీ తరువాయి)

కళద్వారా ప్రజలను ఉత్తేజపరచినట్లయితే ఇటువంటి హేయమైన పరిస్థితి ఉండదు.

ఇది మార్పురాని పరిస్థితి అని చేతులు కట్టుకుకూర్చోనవసరంలేదు. పత్రికలు పూనుకుని ఆందోళన సాగించినట్టయితే ఈ పరిస్థితి త్వరలోనే మారుతుంది. సినిమా కళయొక్క వాస్తవాభివృద్ధిని గురించి ఎవరూ ఆందోళన చెందకుండా, దానియందు ఎవరికీ విశ్వాసం లేకుండా సినిమా కళ దానంతట అదే ఒక సుముహూర్తాన పైకి రావటం ప్రారంభిస్తుందనుకోవటం పొరపాటు. అనేక రంగాలలోనుంచి సినిమాకళపై ఆదరం బయలుదేరి అది ఒక యథార్థస్వరూపం తీసుకోవాలి. అప్పుడుగాని సరిఅయిన చిత్రాలు వెలువడవు. మన జాతినీ, జీవితాన్నీ, సంస్కృతినీ, ఆశయాలనూ ప్రతిబింబించే చిత్రాలు సాగిననాడు ప్రేక్షకులు సినిమాతారల కృత్రిమ సౌందర్యాన్ని ఆరాధించటం మాని సినిమాకళ సహాయంతో నూతన చైతన్యం సాధించగలుగుతారు. ★

రాజు—పేద

బి. ఏ. సుబ్బారావు ప్రొడక్షన్సువారు 'రాజు - పేద' కథను తెలుగులో చిత్రంగా నిర్మిస్తున్నారు. ఈకథను భారతీయ సంప్రదాయాలకు అనుగుణంగా మారుస్తారని తెలుస్తున్నది. దర్శకత్వం బి. ఏ. సుబ్బారావుగారు నిర్వహిస్తారు. సంభాషణలు తాపీధర్మారావుగారు సమకూరుస్తారు. వాహినీ స్టూడియోలో షూటింగు జరుగుతుంది.

ముక్కుకు సూటిగా పోతే

(19-వ పేజీ తరువాయి)

లేందే ఎలా జీవయాత్ర గడపగలరు? గ్రామప్రజలకు సహాయం చేస్తే ప్రభుత్వపు లెక్కలు సరిగా ఎలా తయారవుతయి? కాబట్టే ఈ అక్రమతంతంతా ప్రభుత్వమే చూసీ మూడనట్లూరుకొంటున్నదేమోనని శేఖర మభిప్రాయం.

మూడు సంవత్సరాలు రెవెన్యూ ఇన్‌స్పెక్టరు ఉద్యోగం చేసిన తర్వాత తిరిగి శేఖరాన్ని ఆఫీసులో వేశారు. బాల్య స్నేహితు లెవరైనా కనుపిస్తే 'యేంరా, ఎంత సంపాయించేవు ఇన్‌స్పెక్టరు ఉద్యోగంలో?' అని అడిగేవారు. శేఖరాని కేమీ జవాబు చెప్పడానికి తోచక "నీ మొహంలే" అనేసి తప్పించుకొనేవాడు.

రెవెన్యూ ఇన్‌స్పెక్టరు ఉద్యోగంలో అతనెంత కష్టపడి, న్యాయంగా పనిచేసినా, ఏవో లేనిపోని సాకులతో, తాసీల్దారతని మీద ఛార్జీలు ఫ్రేముచేయించి, చివరకతని కదివరకు ఆరుసంవత్సరాలలోనూ వచ్చిన ఇంక్రిమెంట్లు ఊడగొట్టించాడు. కలెక్టరు కప్పీలు పెట్టుకొన్నా, శేఖరం మొర ఎవరూ వినలేదు.

ఇప్పుడు శేఖరం తను ప్రారంభంలో ఆరు సంవత్సరాల క్రితం యెంత జీతం తీసుకొంటున్నాడో, ఇప్పుడూ అంతే తీసుకొంటున్నాడు. అతననుకుంటూ ఉంటాడు 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది కాని, అధికార్లలో పాతుకొనిపోయిన ఆ బానిసభావాలు, దోపిడీ విధానాలు ఇంకా నశించలేదు. అధికార్ల ప్రవర్తనలో మార్పు వచ్చి, ప్రజల సుఖంకోసమే తాము నౌకర్లగా నియమింపబడ్డామని తెలుసుకొన్ననాడే, దేశం బాగుపడుతుంది. అందాకా ముక్కుకి సూటిగాపోయే ఉద్యోగస్థులందరి గతీ అధోగతే' అని.

శేఖరం తన సంసారంలో, ఉద్యోగంలో, జీవచ్ఛవంలాగా ఈదుతున్నాడు. అతనికి ఉద్యోగంలో ప్రమోషనాశ మరి లేదు. మరి అతనికీ అంధకారంలోనుంచి విముక్తి యెప్పుడో? ★

అత్తవాడిచ్చిన కట్నం

(6-వ పేజీ తరువాయి)

'ఒరేయి, ఈ మూడువేలు నీ దగ్గిరుంచు, తరువాత తీసుకుంటారు' అన్నాడు.

'ఎక్కడిదిరా ఈ డబ్బు?' అని అడిగాను.

'ఆ అమ్మ యిచ్చింది' అన్నాడు.

నవ్వాలో ఏడవాలో తెలియక

'ఆ పెళ్లికొడుకువి నువ్వేనా' అని అడిగాను.

'అవునురా, రాత్రి మెయిలుకు బిచాణా కట్టు. బొంబా యెళ్లొద్దాం. యింక ఈ ఊళ్లో ఉంటే బండారం బయటపడుతుంది." అన్నాడు.

ఆరి పిడుగా! అని ముక్కుమీద వేలేసుకున్నాను. ★

శేఖర్: "నేను వంటా, పనీపాటా, బాగా చేతైన పిల్లనే పెళ్లిచేసుకుంటాగాని, అందంగా ఉండాలనీ, సంగీతం వచ్చినదై ఉండాలనీ నాకేం పట్టింపులులేవు."

రామం: "అలాగైతే మాఇంట్లో వంటలక్క వుంది. ఇష్టమైతే ఒకసారి వచ్చిచూడు."